# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## ప్రాంతీయ వార్తలు

తేదీ: 21-04-2026 సమయం : సాయంకాలం 6గం. 10ని.లు

## ముఖ్యాంశాలు

- రాష్ట్ర మంత్రుల బృందం సింగపూర్ లో పర్యటిస్తోంది.
- పీఎం జన్ మన్ పథకం కింద రాష్ట్రానికి 130 కొత్త అంగన్వాడీ కేంద్రాలను కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిందని మంత్రి గుమ్మిడి సంధ్యారాణి తెలిపారు.
- రాష్ట్రంలో 750 నూతన బస్సులు ప్రయాణికులకు త్వరలో అందుబాటులోకి రానున్నాయని ఆర్టీసీ ఛైర్మన్ కొనకళ్ళ నారాయణరావు చెప్పారు.
- గిరిజనుల ఆరాధ్య దైవం పాడేరు శ్రీ మోదకొండమ్మ వారి వార్షిక మహోత్సవాలు వచ్చే నెల 17,18,19 తేదీలలో జరగనున్నాయి.
- రాష్ట్రంలో గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నందున ప్రజలు తప్పనిసరిగా జాగ్రత్తలు తీసుకోవాలని విపత్తుల నిర్వహణ సంస్థ సూచించింది.

====================

సింగపూర్‌లో రాష్ట్ర మంత్రుల బృందం చేస్తున్న అధ్యయన పర్యటనలో భాగంగా తొలి రోజు కార్యక్రమాలు విజయవంతంగా ముగిశాయి. ప్రజల భాగస్వామ్యం, సామాజిక సమగ్రత అంశంపై ప్రత్యేకంగా రూపొందించిన ఈ కార్యక్రమంలో మంత్రుల బృందం పాల్గొంది. ఉదయం సింగపూర్ చేరుకున్న బృందం సింగపూర్ విదేశాంగ, వాణిజ్య శాఖల మంత్రి ప్రతినిధి మిస్ గాన్ సియో హువాంగ్ తో సమావేశమై పెట్టుబడులు, మౌలిక వసతుల కల్పనపై చర్చలు జరిపింది. తరువాత సింగపూర్ లో అతిపెద్ద లైఫ్ స్టైల్ సెంటర్ గా ఉన్న అవర్ టాంపైన్స్ హబ్ సందర్శించి అక్కడ క్రీడలు, స్విమ్మింగ్ పూల్స్, లైబ్రరీలు, మాల్స్, ఫెస్టివ్ ఆర్ట్స్ థియేటర్ ను మంత్రులు సందర్శించారు. ఈ సందర్భంగా అవర్ టాంపిన్స్ హబ్ అసోసియేషన్ ప్రతినిధులు సింగపూర్ ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలు, ప్రజా సేవల అమలు విధానంపై మంత్రులకు వివరించారు. ప్రజా సమస్యల పరిష్కారం ఏ విధంగా, పాదర్శకంగా జరుగుతుందో సింగపూర్ ప్రతినిధులను మంత్రులు అడిగి తెలుసుకున్నారు. సాయంత్రం 'మీట్-ది-పీపుల్ సెషన్'లో పాల్గొని ప్రజలతో ప్రజాప్రతినిధులు ఏవిధంగా మమేకమవుతూ.. సమస్యలను పరిష్కరిస్తారో ప్రత్యక్షంగా గమనించారు. ఈ అధ్యయన పర్యటన ద్వారా ప్రజల భాగస్వామ్యాన్ని పెంపొందించడంలో సింగపూర్ అనుసరిస్తున్న విధానాలు, పారదర్శకత, సమగ్ర అభివృద్ధి లక్ష్యాలు వంటి అంశాలను అవగాహన చేసుకుని, వాటిని మన రాష్ట్రంలో అమలు చేసే అవకాశాలను పరిశీలిస్తున్నామని మంత్రుల బృందం తెలిపింది.

====================

పోషణ్ పఖ్వాడాలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాల్సిన అవసరం ఉందని రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమం, గిరిజన సంక్షేమ శాఖా మంత్రి గుమ్మిడి సంధ్యారాణి అన్నారు. పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టరేట్లో ఈరోజు నిర్వహించిన పోషణ్ పఖ్వాడా కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. చిన్నారుల జీవితంలోని తొలి ఆరు సంవత్సరాలు అత్యంత కీలకమైన కాలమని చెప్పారు. పిల్లల ఎదుగుదల అనేది కేవలం బరువు, పొడవులకు మాత్రమే పరిమితం కాదని, మెదడు అభివృద్ధి, నేర్చుకునే శక్తి, భావోద్వేగ వికాసం కూడా ముఖ్యమేనని స్పష్టం చేశారు. 3 సంవత్సరాల వయస్సు వరకూ పిల్లల మెదడు వేగంగా అభివృద్ధి చెందుతుందని, ఈ సమయంలో తల్లిదండ్రుల ప్రేమ, శ్రద్ధ

ఎంతో అవసరమని తెలిపారు. పిల్లలతో మాట్లాడటం, పాటలు పాడటం వంటి చర్యలు మెదడు అభివృద్ధికి దోహదపడతాయని చెప్పారు. 3 నుండి 6 సంవత్సరాల వయస్సులో ఆట పాటల ఆధారిత విద్యను ప్రోత్సహించాలని సూచించారు. ఆటల ద్వారా పిల్లల్లో సమస్యల పరిష్కారం, ఆలోచనా శక్తి పెరుగుతాయన్నారు. ఎక్కువ స్క్రీన్ టైమ్ వల్ల పిల్లల్లో మాట ఆలస్యం, నిద్రలో అంతరాయం, ఏకాగ్రత తగ్గడం వంటి సమస్యలు వస్తాయన్నారు. అంగన్వాడీ కేంద్రాలు పిల్లల భవిష్యత్తుకు పునాది వేసే ముఖ్యమైన కేంద్రాలని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పీఎం జన్ మన్ పథకం కింద రాష్ట్రానికి 130 కొత్త అంగన్వాడీ కేంద్రాలు మంజూరు అయినట్లు తెలిపారు.

====================

ఉత్తరాంధ్రలోని గిరిజనుల ఆరాధ్య దైవం పాడేరు శ్రీ మోదకొండమ్మ వారి వార్షిక మహోత్సవాలు వచ్చే నెల 17,18,19 తేదీలలో జరగనున్నాయి. ఈ ఉత్సవాలకు సంబంధించిన గోడ పత్రికను అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ టీ.నిశాంతి ఈరోజు ఆవిష్కరించారు. పోస్టర్ ఆవిష్కరణతో పాటు నూతన ఉత్సవ కమిటీలను కూడా నియమించారు. ఈ సందర్భంగా కలెక్టర్ పాత్రికేయులతో మాట్లాడుతూ... రాష్ట్ర గిరిజన జాతరగా మోదకొండమ్మ ఉత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహిస్తామని చెప్పారు. అధికారులతో పాటు ప్రజలందరూ సహకారం అందించి ఈ ఉత్సవాలను విజయవంతం చేయాలని కోరుతూ...

(వాయిస్...24 సెకన్లు)

====================

ఆంధ్రప్రదేశ్ పర్యాటక రంగానికి జాతీయ స్థాయిలో అరుదైన గుర్తింపు లభించింది. నీతి ఆయోగ్ 'దివ్య భారత్' పేరిట 13 పేజీల సమగ్ర నివేదికతో పాటు, 80 సెకన్ల నిడివి గల ప్రత్యేక వీడియో ద్వారా రాష్ట్రంలోని పర్యాటక ప్రదేశాలను ప్రపంచానికి పరిచయం చేసింది. ప్రకృతి అందాలను ఆస్వాదించాలంటే ఆంధ్రప్రదేశ్‌కు వెళ్లాల్సిందేనని దేశీయ, అంతర్జాతీయ పర్యాటకులకు నీతి ఆయోగ్ సూచించింది. ఆంధ్రప్రదేశ్‌ను సందర్శించేందుకు అక్టోబర్ నుండి ఫిబ్రవరి వరకు అత్యంత అనువైన సమయమని పేర్కొంటూ నెలల వారీగా రాష్ట్రంలోని ఏయే పర్యాటక ప్రాంతాలను సందర్శించవచ్చన్న విషయాలను నీతి ఆయోగ్ వెల్లడించింది. రాష్ట్రంలోని ప్రకృతి ప్రాంతాలు, ప్రసిద్ధ చారిత్రక కట్టడాలు, పురాతన కోటలు, సహజసిద్ధంగా ఏర్పడ్డ గుహలు, విశాల సముద్రతీరం, ఆధ్యాత్మిక ప్రాంతాలు, ప్రఖ్యాతి గాంచిన స్థానిక వంటకాలు, సంప్రదాయ వస్త్రాలు, హస్త కళాకృతులు, బౌద్ధారామాలు, పర్యాటక ఉత్సవాలు, ఘనమైన వారసత్వం తదితర విశేషాలను నీతి ఆయోగ్ ఆ నివేదికలో ప్రస్తావించింది.

====================

విరామం

====================

రాష్ట్రంలో త్వరలో 750 నూతన బస్సులు ప్రయాణికులకు అందుబాటులోకి రానున్నాయని ఏపీఎస్ఆర్టీసీ ఛైర్మన్ కొనకళ్ళ నారాయణరావు తెలిపారు. ఈ కొత్త బస్సుల రాకతో విద్యార్థులు కళాశాలలకు వెళ్లేందుకు మరింత వీలవుతుందన్నారు. మచిలీపట్నంలోని లేడీ యాంప్తిల్ కళాశాలలో మలబార్ సంస్థ సిఎస్ఆర్ నిధులతో ప్రభుత్వ కళాశాలకు చెందిన 59 మంది విద్యార్థినులకు ఆయన ఈరోజు స్కాలర్షిప్ లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఈ సంవత్సరం ఇంటర్మీడియట్ ఫలితాలలో 982 మార్కులు సాధించి రాష్ట్రవ్యాప్తంగా రెండవ ర్యాంకు సాధించిన కళాశాల విద్యార్థిని ఆకాంక్షను అభినందించారు. ప్రతిభకు పేదరికం అడ్డు కాదని మలబార్ వంటి సంస్థల ఆర్థిక సహకారంతో ఎందరో పేద విద్యార్థులు ఉన్నతంగా చదువుకుని స్థిరపడుతున్నారని తెలియజేశారు.

====================

నంద్యాల మార్కెట్ యార్డ్‌లో జొన్నల కొనుగోలు కేంద్రాన్ని మైనార్టీ వ్యవహారాల శాఖా మంత్రి ఎన్ఎండి ఫరూక్ ఈరోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రైతు సేవా కేంద్రాలు (ఆర్.ఎస్.కే) ద్వారా ప్రభుత్వం పారదర్శకంగా జొన్నల కొనుగోలు చేపడుతోందని చెప్పారు. దళారీల ప్రమేయం లేకుండా, మద్దతు ధర నేరుగా రైతుల ఖాతాల్లోకి జమ అయ్యేలా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ప్రభుత్వం ఈ రబీ సీజన్‌కు గాను హైబ్రిడ్ మహేంద్ర రకం జొన్నలు క్వింటాల్ ధర 3 వేల 699 రూపాయలుగానూ, మల్దండి రకం 3 వేల 749 రూపాయలుగా నిర్ణయించిందని చెప్పారు. తేమ శాతం 13, చెడిపోయిన గింజలు ఒక శాతం లోపు నాణ్యతా ప్రమాణాలు పాటించిన జొన్నలను మాత్రమే కొనుగోలు చేస్తారని తెలిపారు. ఈ-పంట నమోదు, ఈ-కెవైసీ పూర్తయిన రైతులు మాత్రమే ఈ సదుపాయాన్ని వినియోగించుకోవాలని మంత్రి స్పష్టం చేశారు.

====================

విజయవాడలోని రాష్ట్ర వక్ఫ్ బోర్డ్ కార్యాలయంలో 14వ బోర్డ్ సమావేశం చైర్మన్ అబ్దుల్ అజీజ్ అధ్యక్షతన ఈరోజు జరిగింది. ఈ సందర్భంగా ప్రవేశపెట్టిన అజెండా అంశాలపై ఏకగ్రీవ తీర్మానం చేశారు. అనంతరం చైర్మన్ అబ్దుల్ అజీజ్ మాట్లాడుతూ, రాష్ట్ర వక్ఫ్ బోర్డ్ ఆధ్వర్యంలో ప్రతి ఏటా 500 మంది ముస్లిం విద్యార్థులకు నాణ్యమైన ఉన్నత విద్యను అందించేందుకు శ్రీకారం చుట్టామని తెలిపారు. జేఈఈ మెయిన్స్, నీట్ శిక్షణ అందిస్తామని రాష్ట్రవ్యాప్తంగా ట్యాలెంట్ టెస్ట్ ద్వారా ఎంపిక చేసిన విద్యార్థులకు ఉచిత రెసిడెన్షియల్ విద్య అందించేందుకు దానికి అయ్యే ఖర్చును పూర్తిగా వక్ఫ్ బోర్డు భరించే విధంగా బోర్డు సమావేశంలో తీర్మానించామని తెలిపారు. ప్రత్యేకంగా నిర్వహించిన ట్యాలెంట్ టెస్ట్ ద్వారా ఎంపికైన ప్రతిభావంతులైన విద్యార్థులకు ఈ పథకం వర్తిస్తుందని నిర్ణయించారు. మొదటి ఏడాది ఇంటర్ మొదటి సంవత్సరానికి గాను 250 మందికి, రెండవ ఏడాది నుంచి ఏటా 500 మందికి ఉచిత రెసిడెన్షియల్ కార్పొరేట్ విద్యను అందిస్తామని వెల్లడించారు. పదవ తరగతి ఫలితాలు విడుదలైన అనంతరం ట్యాలెంట్ టెస్ట్ నిర్వహించి ఈ పథకాన్ని ప్రారంభిస్తామని చెప్పారు.

=====================

నిన్నటి ఉపరితల ద్రోణి ప్రస్తుతం అంతర కర్ణాటక, తమిళనాడు మీదుగా కొమరిన్ ప్రాంతం వరకు సగటు సముద్ర మట్టానికి 900 మీటర్ల ఎత్తు వరకు విస్తరించి ఉందని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. అదే విధంగా ఆంధ్రప్రదేశ్ మీదుగా దిగువ ట్రోపో ఆవరణములో దక్షిణం, నైరుతి దిశగా  గాలులు వీస్తున్నాయని వెల్లడించింది. వీటి ఫలితంగా ఉత్తర కోస్తాఆంధ్రలో ఒకటి రెండు చోట్ల రాగల  రెండు రోజులు తేలికపాటి నుండి ఒక మోస్తరు వర్షం కురిసే అవకాశముందని వాతావరణ శాఖ అధికారులు వెల్లడించారు. బలమైన గాలులు గంటకు 30-40 కిలోమీటర్ల వేగంతో వీచే అవకాశముందని తెలియజేశారు.

=====================

రాష్ట్రంలో ఎండ, వడగాలులు తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. 76 మండలాల్లో రేపు తీవ్ర వడగాల్పులు, మరో 134 మండలాల్లో వడగాల్పులు ప్రభావం చూపే అవకాశం ఉందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ ప్రఖర్ జైన్ తెలిపారు. ఇక గురువారం 51మండలాల్లో తీవ్ర వడగాల్పులు వీచే అవకాశం ఉందన్నారు. గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నందున ప్రజలు తప్పనిసరిగా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈరోజు అత్యధికంగా తిరుపతి జిల్లా వరదయ్యపాలెంలో 44.4°C, ప్రకాశం జిల్లా కొప్పెరపాడులో 44.1°C ఉష్ణోగ్రతలు నమోదయ్యాయని తెలియజేశారు.

=====================

=====================